
# సింగిల్ పేజీ కథలు



## ఆకలి...???

క్రొత్తపిక్చర్ రిలీజయింది.

థియేటర్ ఆవరణమంతా జనంతో కిటకిటలాడుతోంది. టికెట్స్ కోసం బుకింగ్ దగ్గర కొట్టుకుంటున్నారు. టికెట్ దొరుకుతుందో లేదో అనుకుంటూ పొడవుగా ఉన్న క్యూలో నిల్చున్నాను.



''పావలా ఉంటే ఇవ్వండిసార్...''

ఆ కంఠం విని తలత్రిప్పి చూసాను.

లోతుకుపోయిన కళ్ళతో దీనంగా నావంకే చూస్తున్నాడొక వ్యక్తి.

''మూడు రోజుల నుండి తిండి లేదు. కనీసం టీనీళ్ళున్నా తాగలేదు. మీరు ధర్మం చేసారంటే మీ పేరు చెప్పుకొని కాస్త టీనీళ్ళు తాగుతాను.''కడుపు చేత పట్టుకొని మాట్లాడటానికి కూడా శక్తి లేనట్లుగా అన్నాడు.

అతని వైపొకసారి తేరిపార చూసాను.

ఎముకల గూడుకి చర్మం అంటించినట్లున్న ఒంటిమీద చిరుగుల చొక్కా.... లోనికి పోయిన బుగ్గలు...మాసిన గెడ్డం...తైల సంస్కారం లేక ఎర్రబారిన జుట్టుతో దారిద్ర్యానికి మారుపేరుగా ఉన్నాడు.

అతన్ని చూస్తే నాకు జాలివేసింది. అతనికి పావలా ఇచ్చినంతమాత్రాన నాకు తరిగిపోయిందేమీ లేదనుకుంటూ జేబుల్లో చిల్లరకోసం వెదికాను. నా జేబులో రూపాయి బిళ్ళతప్ప ఇంక చిల్లర డబ్బులు లేవు. 'పోనీలే...టీ నీళ్ళున్నా తాగుతాడు'అనుకొని ఆ రూపాయి అతనికి ఇచ్చాను.

నావైపు కృతజ్ఞతగా చూసి, అలా అడుక్కుంటూ ముందుకు వెళ్ళాడతను.

అంతలో బుకింగ్ క్లోజ్ అయింది.

ఇక చేసేదిలేక బయటకు నడిచాను.

అక్కడ-

ఇందాక ఆకలి వేస్తుందం టూ నా దగ్గర రూపాయి వసూలు చేసిన వ్యక్తి, తన జేబులో ఉన్న చిల్లర డబ్బు అన్నీ తీసి పువ్వులమ్మే అమ్మి చేతిలో పోసాడు. ఆమె ఒక పెద్ద పూలమాల తీసి అతని చేతికిచ్చింది.

''మూడు రోజులుగా తిండిలేదని అడుక్కున్నవాడు పూలమాలకొం టున్నాడేమిటి?'' అనుకుంటూ అలాగే చీకట్లో నిలబడి గమనించసాగాను.

అతను ఆ పూలమాలను తీసుకెళ్ళి థియేటర్ ముందు ఉన్న తన అభిమాన హీరో బొమ్మకు అలంకరించి, ఆనందం తో ఓ మారు గట్టిగా విజిల్ వేసి, థియే టర్లోనికి పరుగుతీసాడు.

**బద్దిగం పాండురంగారెడ్డి,**
**10-1-241/1, భాగ్యనగర్,**
**కరీంనగర్-505002**

## మానవత్వం

రైలు ముందుకు పోతోంది.

''అమ్మో..కాళ్ళు తొక్కేస్తున్నారు.''ఏడుపు మొదలుపెట్టింది నల్గురు పిల్లల తల్లి.

పిల్లలు కూడా శృతికలిపారు. భర్త ఏమీ చేయలేక కంగారుగా అలా చూస్తున్నాడు.

''రేపు పండగ పెట్టుకొని పిల్లలతో, లగేజీలతో జనరల్లో వెళ్లకపోతే రిజర్వేషన్ చేయించుకోవచ్చుగదండీ.'' వాళ్ళ పడే ఇబ్బందిని చూసి అప్రయత్నంగా అనేసాను.

''ఏ క్షణం బయలుదేర్తామో ఊహించని ప్రయాణాలు. అందుకే ఈ ఇక్కట్లు. లేకపోతే రిజర్వేషన్ చేయించుకునే వాళ్ళం.'' బదులిచ్చాడు.

ఇంతలో వాళ్లావిడ..

''ఏం తల్లీ..సాటి ఆడదాన్ని, ఇలా ఇబ్బంది పడితే చూస్తారేటి, సీటు సర్దుబాటు చెయ్యగూడదా?'' ముందు సీట్లవాళ్లని అర్థిస్తోంది.

తమకేమీ పట్టనట్లు అందరూ కునికిపాట్లు పడుతున్నారు.

''మనుషులు కాదు రాక్షసులు. మానవత్వం లేకుండా రాక్షసుల్లా ప్రవరిస్తున్నారు. ఎదుటోళ్ల కష్టాలు పడుతుంటే చూస్తున్నారు కాని చిన్నసీటు ఇస్తున్నారు కాదు.'' కోపంగా తిడుతోంది.

నాకు ఆ శోకాలకు ఓపిక నశించింది.

''ఎందుకండీ ఆ తిట్లు, మీరు ఎక్కడికి వెళ్తున్నారు?'' అడిగాను.

''విశాఖపట్నం...''చెప్పిందామె.

''విజయవాడలో సగం ఖాళీ, ఫ్రీగా వుంటుందిలెండి.'' ఎవరో పెద్దాయన చెప్పాడు. అలాగే నిల్చుని కునికిపాట్లు పడుతున్నాం.

విజయవాడ రానే వచ్చింది. చాలా సీట్లు ఖాళీ అయ్యాయి. ఎదురుగా వున్న సీట్లు ఖాళీ అవగానే భార్యాపిల్లలను కూర్చుండబెట్టి, లగేజీలు అన్నీ పట్టుకొని, భర్త కూర్చున్నాడు.

నాకూ సీటు దొరికింది. కూర్చున్నాను. విజయవాడలో ఖాళీ అయిన దానికంటే చాలా ఫుల్లయ్యింది. బండిలో మొదటి పరిస్థితే.

గార్డు విజిల్ వేయడంతో రైలు బయలుదేరింది.

''అవ్వా...వయసైపోయిన ముసల్దాన్ని, నిలబడ నేకుండాను. ప్రాణం నీరసంగుంది, చిన్న జాగా సర్దిపెట్టమ్మా'' దీనంగా పదేళ్ల మనవడి ఫూతపట్టుకుంటూ ఆ జనాలలో ఉక్కిరి బిక్కిరి అయిపోతుంది.

ఆ మాట వినిపించగానే నల్గురు పిల్లలతో కూర్చున్న తల్లి ''అబ్బబ్బ... గోలగోల, రామేశ్వరం వెళ్లినా శనీశ్వరుడు వదలనట్లుంది. వెడవెడంగా కూర్చోండి. దిక్కుమాలిన బాధ సీటు కావాలట సీటు.'' చేతిలో వున్న లగేజీ ఒళ్లో పెట్టుకుంటూ భర్తతో చెప్తోంది.

''సత్యవతీ...పాపం ముసలావిడ చాలా ఇబ్బంది పడుతోంది. కొద్దిగా సర్దుకొని కూర్చోగూడదూ'' భర్త చెప్తున్నాడు.

''మీరుండండి...సీటు కోసం ఇబ్బంది పడితే మనకెందుకండీ. ఎవరికి సీటిచ్చేది లేదు. కళ్లు మూసుకుని పడుకోండి.'' భర్తను మందలించినట్లుగా చెప్పిందామె.

భార్యావిధేయుడిలా అతను మారు మాట్లాడలేదు.

ఏం మానవత్వమండీ బాబు ఈవిడది. సమాజంలో శ్రీరంగనీతులు చెప్పేవారేగాని పాటించేవారు మాత్రం ఎక్కడోవుంటారు. ముందు ఇలాంటి సత్యవతిలాంటి వాళ్లు మారాలి. అప్పుడే ఈ సమాజం మానవతా విలువలతో ముందుకు పోగలదు- మనసులో అనుకున్నాను.



నేను కొద్దిగా సర్దుకొని ముసలావిడకు, వాళ్లమనవడికి చోటిచ్చాను. ఇంతవరకు ఇవన్నీ గమనించిన నాకు అప్రయత్నంగా నవ్వు వచ్చేసింది.

ఫక్కున నవ్వాను.

ముందుసీట్లలో కూర్చున్న నల్గురు పిల్లల ఫ్యామిలీ మానవత్వానికి నవ్వాగటం లేదు.

ఆ నవ్వులో అర్థం ఆవిడ గ్రహించే వుంటుంది. తల దించుకుంది.

-నేదునూరి శ్రీనివాసరావు, సన్నాఫ్
రామారావు, ఉత్తరావల్లి పోస్ట్
మెరకముడిదాం మండలం,
విజయనగరంజిల్లా-535124

## చుక్కల చీర

"ఛీ డర్టీ సిటీలావుంది." శిల్ప కారులో వెళ్తూ చిరాగ్గా. ఆమె అలా తిట్టుకోవటానికి పాపం కారణం లేక పోలేదు. ప్రొద్దుటి నుంచి తిరుగుతున్నా ఆమెకి, ఫ్రెండ్స్‌కి నచ్చిన చీరే దొరకలేదు.

సడన్‌బ్రేక్‌తో కారాగింది.

"ఏమైంది డ్రైవర్" అంది చిరాగ్గా.

"గేటు వేశారమ్మా" అన్నాడు వినయంగా.



"ఛీ డర్టీ. గంట ముందర వేస్తారు గేటు." మళ్లీ చిరాకు పడింది. డబ్బు చాలా ఉండి, ఫారిన్‌లో చదువుకుని ఇండియా కొచ్చిన శిల్పకి ఫారిన్ రిటర్న్ వాళ్లకుండే గర్వమే ఉంది. ఈ దేశం తనకి తగదని ఆమె భావం.

చిరాగ్గా తలతిప్పిన శిల్ప కళ్లు మెరిసాయి. కారణం ఒక చుక్కల చీర. రోడ్డు పక్కన ఒక చిన్న దుకాణంలో వ్రేలాడగట్టి ఉంది. కోరాకలరుకి ఆరెంజ్ బోర్డు. చిన్న, చిన్న చుక్కలు, అలాంటిదే బ్లౌజు అందంగా అమర్చాడు వెంకటగిరి జరీచీర. ఇన్ని గంటలు తిరిగినా నచ్చనిది వెంటనే నచ్చింది శిల్పకి. కానీ రోడ్డుప్రక్కన కట్టాడే చీర ఎలాగ. అవి కొంటే తన స్నేహితులకి చులకనైపోదూ. తల తిప్పుకుంది.

కానీ రెండు నిముషాలకే మళ్లీ అటు చూసింది. షాపు యజమాని కూడా కారువంకే చూస్తున్నాడు ఆశగా.

స్నేహితులు నవ్వుకుంటారనే అనుమానం ఉన్నా కోరిక చంపుకోలేక చీర ధర అడిగిరమ్మంది డ్రైవర్‌ని.

"రెండువందలే" అన్నాడు షాపువాడు ఆశగా. "కొంచెం తగ్గిస్తాను కూడా" అన్నాడు. "రిబేటు ఉంది.".

"ఏంటీ ఆ చీర నీకు నచ్చిందా?" అంది దీప ఆశ్చర్యంగా.

"వెరీ చీప్ శారీ" అంది రాణి.

"నోనో జస్ట్‌ఫర్ టైంపాస్" అంది శిల్ప.

ఆ చీరని తన తీరని కోరికల్లో జమ చేస్తూ. ఆమెకి తీరని కోరికలా అనిపించ వచ్చు, కానీ ఉన్నా యి. బస్సులో వెళ్లటం, రోడ్డు ప్రక్క మిర్చి బజ్జీలు తినటం వగైరాలు. ఇవన్నీ తీరని కోరిక లే. ఆ రాత్రి ఆ చీర కొని కట్టుకున్నట్లు కలగని తృప్తి పడింది.

సత్తుకారియర్ పట్టుకొని నడుస్తున్న రత్తిఆగిపోయింది. అందుకు కారణం ఆ చుక్కల చీరే. ఎంత బాగుందది. "ఈ కోకెంతబాబూ" అంది భయపడుతూ. "రెండొందలు" అన్నాడు నొక్కి చెబుతూ. "ఓ అమ్మో రెండొందలే" అనుకుంటూ కదిలిపోయింది సత్తికూడా. ఆ చీర తన తీరని కోరికల్లో జమ వేస్తూ. అయితే ఈసారి ఎవరికీ సందేహం రాదు.

అయితే విశేషం ఏమిటంటే రత్తి యజమానురాలు శిల్ప ఏడాదికోసారి పెట్టే చీర బదులు డబ్బులు అడిగి తీసుకుని ఆ చీర కొనుక్కుంది రత్తింది. అయితే ఆ చీర చూసినప్పుడల్లా అందులో ఇనుమడించిన రత్తి అందాన్ని చూస్తూ, మనస్సులో ఏదో అసంతృప్తి రెపరెపలాడి ఏదో ఒంకపెట్టి తిట్టేది శిల్ప. ఎందుకో అర్థంకాక సతమతమయ్యేది రత్తి.

"ఈ కోకచ్చిరాలేదు" అనుకుంది.

-ఆకెళ్ల వెంకట సుబ్బలక్ష్మి,
24-4-30/1, విష్ణుపురి, సఫిల్గూడ,
హైదరాబాద్-4

## దేముణ్ణడగాలి

నగరానికి దూరంగా...నరసంచారం పగలు కూడా నామమాత్రంగానే ఉండే ప్రాంతం. అడివిలాటి చోటు. అక్కడ-- చీకటి గుయ్యారం లో... పాడుపడిన గుడి. ఆ గుడి లో-పూజాపునస్కారాలకి నోచుకోని పేద దేముడు. ఆ దేముడి ముందొక దొంగ.

దేముడి ముందు దీపం వెలిగించాడు-ప్రమిదలో నూనె, వత్తీ వేసి, భుజాన ఉన్న మూటను విప్పి-నైవేద్యం పెడు తున్నట్లు దేముడి ముందుంచాడు. భక్తిగా రెండుచేతులూ జోడించి నమస్కారం పెడుతూ కళ్లుమూసు కున్నాడు.

దేముడిముందు-దీపకాంతి లో..డబ్బుకట్టలూ, బంగారు నగలూ జిగేల్మంటూ మెరుస్తున్నాయి. "దేముడా! నీకు తెలియని దేమీ లేదు. మామూలుగా బతకలేక దొంగతనాలకి దిగాను. తొలిసారి దొంగతనానికి వెళ్తూ నీ ఆశీస్సులు పొందాను. దొంగతనం పారింది. ఇది నా పదో దొంగతనం..చివరిది కూడా. ఇంతవరకూ సంపాదించిన దానితో నా శేష జీవితం సుఖంగానూ, మంచిగానూ, గౌరవంగానూ, వెళ్లిపోతుంది. ఇకపై ఏ చెడ్డపనీ చెయ్యను. మంచిగా బతికేందుకు నాకు శక్తినివ్వు. పదిసార్లు నేను పట్టుబడకుండా... దొంగ తనం పారేలా చల్లగా దయగా చూశావు. మళ్లీ నన్నాశీర్వదించు." అని నివేదించు కుంటూ దేముడి పాదాలను కళ్లకద్దుకుంటూంటే....

ఒక్కసారి గుహలాటి గుడినిండా వెలుగు. బూట్ల శబ్దాలు.

"హాండ్సప్-" అరుపులు.

త్రుళ్లిపడి చూశాడు దొంగ. తన చుట్టూ నలుగురు పోలీసులు. తుపాకీలు గురిపెట్టి. పరిస్థితినీ నిస్సహాయతనీ గ్రహించుకుని అతను చేతులెత్తేశాడు. తక్షణం పోలీసులతని చేతులకి బేడీలు వేసేసి దొంగ సొమ్ము స్వాధీనం చేసు కున్నారు.

పోలీసులు తనని అక్కడినుంచి నడిపించబోతూంటే-


"సొత్తు స్వాధీనం చేసుకున్నారు. నా చేతులకి బేడీలు వేశారు. మీరు నలుగురూ. నేనొక్కణ్ణే. ఈ గుడికున్న మార్గమూ ఒక్కటే. కనుక నేను తప్పించుకోవడం అసాధ్యం. మీరు ద్వారం దగ్గరుండి నన్నొక్క నిముషం దేముడి ముందు ఒంటరిగా వొదలండి. దేముని ఎదుట ప్రమాణం చేస్తున్నాను. తప్పించుకునే ప్రయత్నమే చేయనని. ఒక్క నిముషం దేముడినీ..నన్నూ.. ఏకాంతంగా వొదలండి." అతను బతి మాలుకున్నాడు.

"ఎందుకూ?" ఒక పోలీసడిగాడు.

"దేవుణ్నొక విషయం అడగాలి."

"దేముడు చెబుతాడా?" నవ్వాడు పోలీసు పిచ్చివాడిని చూసినట్లు చూస్తూ.

"చెబుతాడు."



"సరే." తుపాకీల గురి అతని మీదే ఉంచి వాళ్లు ద్వారం వేపు నడిచారు. దొంగా దేముడూ ఏకాంతంగా మిగిలేలా.

"దేముడా! దయుంచి నా సందేహం తీర్చు. దొంగతనాలు చేసిన్నాళ్లు రక్షించుతూ వొచ్చావే, మానేసి మంచి వాడి నౌతున్న తరుణంలో ఎందుకు పట్టించావు?"

దేముడు నవ్వాడు. "ఇన్నాళ్లూ ఐతే నువ్వింకా దొంగతనాలు చేయబోతూనే ఉంటావుకదా అని ఉదాసీనంగా ఉండగలిగాను. ఇటు పై దొంగతనాలు చేయవు. యిదే నీ చివరి దొంగతనం కనుక తక్షణం తగిన చర్య తీసుకోకపోతే అవకాశం చేజారిపోతుంది కదా? అందుకని. చూడూ..కలియుగంలో మనిషి తన జీవితంలో చేసే మంచి పనులకీ చెడ్డ పనులకీ కూడా ఫలితం అతని జీవితంలోనే ఈ భూమిమీదే అనుభవించెయ్యాలి. నువ్వు చేసిన నేరాలకు శిక్ష అనుభవించాలి."ఆ సమాధానంతో దొంగ సంతృప్తి చెందినట్లే ఉన్నాడు. అతని మనసులోని అనుమానం పటాపంచలయినట్లే ఉంది. అతను దేముడికి మళ్లీ నమస్కరించి పోలీసుల వేపు నడిచాడు.

-ఇచ్ఛాపురపు రామచంద్రం,
ఎల్.ఐ.సి. ఆఫ్ ఇండియా,
అనకాపల్లి -531001

★